

కథా నిలయం
శ్రీకాకుళం

ఉద్యోగికి దూర భూమి లేద
న్నారు గాని, ఎలక్షన్ డ్యూటీకి

గూడా ఆ సూత్రం వర్తిస్తుంది.
నాకు ఎలక్షన్ డ్యూటీ వేసిన

ఊరు పేరు చదివి గుండె దడదడ లాడింది. మా ఊరికి వంద మైళ్ళ దూరం ఉందని భయంకాదు గాని, అది వీరకేసరిపురం తాలూకాలో వుంది. ఆ తాలూకా పేరు తెలియని వాళ్ళు ఇండియాలో చదువురాని వాళ్ళె వుంటారు. లేదా పేపరు చదవని వాళ్ళయినా అయివుండాలి. నెలకొకసారి కనీసం ఆ తాలూకాలో వున్న ఆఊరు పేరు పేపర్లలో మ్రోగిపోతూ వుంటుంది.

ఇంతకీ ఆ తాలూకా ప్రత్యేకత ఏమిటంటే- అది ఖూనీలకు, కొట్లాటలకూ ప్రసిద్ధి. రాజకీయ చైతన్యం బహు హెచ్చు. బస్సులు ఆపి పగ వారిని కత్తులతో పొడవటమూ, దొమ్మీగా ఊరిమీద పడి ఇళ్ళకు నిప్పంటించడంలో వారికి సాటి వారే!

వాళ్ళ పగలకి, వైరాలకీ అంతూ పొంతూ లేదు. రావణ కాష్టంలా రగులుతూనే ఉంటాయి.

ఆ తాలూకాలో భరతపురం, నాకు ఎలక్షన్‌పడ్డ ఊరు. ఆ ఊరి పేరు నేనెప్పుడూ వినలేదు గాని వంద మైళ్ళ పైచిలుకు వుంటుందని ఆచూకీలో తెలిసింది.

ఎలక్షన్ రోజుకు ముందు రోజు ఎన్నికల శిబిరం నుంచి లారీలో బయల్దేరాం. మధ్య మధ్యలో కొన్ని బ్యాలెల వాళ్ళని దించుకుంటూ బయల్దేరింది లారీ.

భోజనం వేళకి వీరకేసరిపురం చేరుకున్నాం. అప్పటికి అందరూ దిగిపోయారు. మిగిలింది రెండు బ్యాచీలు. ఒకళ్ళు మధ్యలో దిగి పోతారు. ఇక మిగిలేది భరతపురం వాళ్ళమే!

వాళ్ళు కూడా దిగిపోయారు మధ్యలో. అప్పటికి సాయంకాలం నాలుగైంది.

ఇక ఆ తర్వాత రోడ్డు అనేది లేదు. అన్నీ రాళ్ళు. వానాకాలంలో కాలిబాట తప్పితే రోడ్డు ఆనవాలు దొరకదట.

పది మైళ్ళు అలా లారీలో ప్రయాణం చేసేసరికి ఒళ్ళు హూనమయిపోయి, స్వర్గంలో వున్న తాత ముత్తాతలు జ్ఞాపకం వచ్చారు.

"ఇక బండి కదలదు సార్!" అన్నాడు లారీ డ్రైవర్ దిగి.

ఎదురుగా చూస్తే ఇరవై అడుగుల వెడల్పున పారుతున్న వాగు కనిపించింది.

"భరతపురం ఇంకా ఎంత దూరం వుంది?" అన్నాను.

"ఏమో సార్! ఈ రూట్‌లో ఎప్పుడూ రాలేదు. ఇంత దరిద్రంగా ఉందేం సార్? వీళ్ళిచ్చే కిరాయికి నాలుగు రెట్లు రిపేర్లు అవుతాయి

మా బండికి. గవర్నమెంటు పని కాబట్టి తప్పలేదు'' అన్నాడు డ్రైవర్.

నాతోపాటు వచ్చిన పోలింగ్ ఆఫీసర్లు, పోలీసులు లారీ దిగి నిలుచున్నారు. దిక్కు తోచడం లేదు. ఆ ఊరు ఎంత దూరంలో వుందో చెప్పే నాధుడే లేడు.

కాసేపటికి పశువులను తోలుకుంటూ పోతున్న కుర్రాడొకడు వచ్చాడు. వాడు చెప్పాడు దారి. ఇంకా 2 మైళ్ళు పోతే పీనుగుల పాలెం వస్తుందట. ఆ తర్వాత 4 మైళ్ళు పోతే వుందట భరతపురం!

ఇంకో కొత్త సంగతి కూడా చెప్పాడు ఆ కుర్రాడు. ఆ వాగు ప్రమాదకరమైంది కాదట. దాని లోతు మోకాళ్ళ లోపే అన్నాడు. లారీ యదేచ్ఛగా పోవచ్చునట.

"ఇంకేం! పదవయ్యా బాబూ!'' అన్నాను లారీ డ్రైవర్‌తో.

"ఎలా సార్ పోయేది? ఎవడో దారిన పోయే దానయ్య మాటలు విని వాగులోకి దిగమంటారా? కూరుకుపోయిందంటే ఇక హైద్రాబాద్ నుంచి క్రేన్ తీసుకురావాలి. భలే వారు సార్ మీరు!" అని ఎగతాళిగా నవ్వాడు డ్రైవర్.

"పోనీ, మీ క్లీనర్‌ని దిగి చూడమనరాదా- అంత భయమైతే?" అన్నాను.

"నాకు ఈత రాదు సార్! నేను దిగను. నాకు నీళ్ళ గండం ఉందని మా నాన్నగారు చెప్పారు" అని భయంతో ముడుచుకు పోయాడు క్లీనర్ కుర్రాడు.

నాకు ఒళ్ళు మండుకొచ్చింది. వరస చూస్తుంటే చెడా మడా తిడదామనుకున్నాను. 'ఇదేం గవర్నమెంట్ పని అనుకున్నారా, లేక పోతే మార్కెట్‌కి సరుకు ఎత్తుకెళ్ళడం అనుకున్నారా? జాగ్రత్త! నేను తలుచుకుంటే కటకటాల వెనుకకి నెట్టించగలను' అనాలనుకున్నాను.

'కాని వాళ్ళు నన్ను లెక్క జేస్తారా- వట్టి పుణ్యానికి వాళ్ళకి చెడు కావడం తప్పితే?' అనుకుని నోరు మూసుకుని ఊరుకున్నాను.

ఈ లోపల గొడ్లు కాసే కుర్రాడే వాగులో దిగి చక్కా పోయాడు. పశువులు గూడా సరదాగా నడిచిపోతున్నాయి. నాకు ధైర్యం వచ్చి ప్యాంట్ పైకి మడిచి నాలుగు అడుగులు వేశాను. కాళ్ళ క్రింద రాళ్ళు తగిలాయి.

"అన్నీ రాళ్ళే లేవయ్యా! కావాలంటే దిగి చూడు!" అన్నాను.

డ్రైవర్ తిట్టుకుంటూ, వాగులోకి దిగి అవతలి ఒడ్డు వరకూ వెళ్ళి వచ్చాడు. తృప్తి పడినట్లే

కనిపించాడు మానవుడు.

తర్వాత బండి ఎక్కి స్టీరింగ్ ముందు కూర్చుని నడిపించాడు.

ఎట్టకేలకు వాగు దాటింది బండి. ఇక ఆ తర్వాత బండి పొలాల్లో పోతున్నదో, స్మశానాల్లో పోతున్నదో మాకు తెలియడం లేదు. రోడ్డు వున్న చిహ్నాలు ఏమీ లేవు. చుట్టూ వేరుశనగ చేలు- మధ్యలో ఖాళీ వుండటాన, అదే రోడ్డు అనుకుని పోనిస్తున్నాడు డ్రైవర్. రాళ్ళు ఎక్కువ లేవు గాని, అన్నీ బురద గుంటలే. చలికాలంలోనే ఇట్లా వుంటే వానాకాలం ఎలా వుంటుందో పరిస్థితి?

పీనుగుల పాలెం వచ్చాక ఇక లారీ కదలదని రూఢిగా తేలిపోయింది. భరతపురం కరణం, మునసబు ఆ వూరి చివర రెండెడ్ల బండితో సహా ప్రత్యక్షమయ్యారు. లారీని చూసి లేచి నిల్చున్నారు.

"మేమే సార్ కరణం, మునసబు!" అని వాళ్ళని వాళ్ళు పరిచయం చేసుకున్నారు.

రెండెడ్ల బండి చూసి నా పై ప్రాణాలు పైనే పోయాయి. నాలుగు మైళ్ళు అందులో ప్రయాణం చెయ్యాలని వాళ్ళు చెప్పేసరికి బిక్కచచ్చిపోయాను.

అప్పుడెప్పుడో మా బామ్మర్ది పెళ్ళికి వెళ్ళినప్పుడు చేసిన రెండెడ్ల ప్రయాణం మొన్న మొన్నటి వరకూ మర్చిపోలేదు. ఇప్పుడీ అనుభవం జన్మంతా జ్ఞాపకం వుంటుంది కాబోలు!

"నేను నడుస్తాను లెండి!" అన్నాను. ఎలక్షన్ మెటీరియల్ వున్న గోతాం బండిలో పడేశాక, పోలింగ్ ఆఫీసర్లు, పోలీసులు నిర్భయంగా బండిలో ఎక్కి కూర్చున్నారు.

"చీకటిలో నడుస్తారా? భలేవారే పంతులుగారూ! ఈ ప్రాంతంలో పాములు ఎక్కువ తిరుగుతుంటాయి" అన్నాడు కరణం.

"ఇనుప తేళ్ళు గూడా వున్నాయి!" అన్నాడు మునసబు బారెడు చుట్ట నోట్లో పెట్టుకుని.

మారు మాట్లాడకుండా బండెక్కి కూర్చున్నాను. ఆర్టీసి బస్సుకంటే అన్యాయమై పోయింది. బండి తోలే వాడితో సహా తొమ్మండుగురు వున్నారు బండిలో. మాకు తోడు ఎలక్షన్ మెటీరియల్ వున్న గోతాం ఒకటి. క్షణమొక యుగంగా గడుస్తూ బండి సాగుతూ వుంది. చీకటి పడి దారి కనిపించడం మానేశాక, బండివాడు లాంతరు వెలిగించి బండికి కట్టాడు.

దాదాపు ఎనిమిదిన్నరకి బండి

ఆగింది. వూరు వచ్చిందన్న సంతోషంతో బండి దిగాను.

"అయ్యా! ఎద్దు మొరాయించింది. ఇక కదలదు" అన్నాడు బండివాడు.

మునసబు వాడిని బూతులు తిట్టాడు-అటువంటి ఎద్దును బండికి కట్టినందుకు. సమయానికి అదే దొరికిందని సంజాయిషీ యిచ్చుకుంటున్నాడు.

ఆకలి దంచేస్తూ వుంది. కడుపులో ఎలుకలు పరిగెత్తుతూంటే, "ఇంకా ఎంత దూరం?" అన్నాను అసహనంగా.

"అయ్యా! ఇంకా మైలు వుంది" అన్నాడు మునసబు.

"ఇప్పుడేం చెయ్యాలి?"

"నడవాల్సిందే."

గోతాం సంచీ బండివాడు నెత్తిన పెట్టుకుని, లాంతరు చేత్తో పట్టుకుని బయల్దేరాడు.

కాలువ గట్టు వెంట కాస్త దూరం. చేల గట్లుమీద మరి కాస్త దూరం-పడుతూ లేస్తూ నడుస్తూంటే కాసేపటికి వూరు దర్శనమిచ్చింది.

వూరి బైట పిల్లకాలువ మీద వున్న వంతెన మీద గోతాం విసిరి కొట్టాడు బండివాడు.

నేను ప్రశ్నార్థకంగా చూశాను.

"పంతులుగారూ! ప్యాంటులు పైకి ఎత్తుకోండి" అని నవ్వాడు మునసబు.

'ఎందుకా?' అని చూసేసరికి ఎదురుగా పెద్ద జలాశయం దర్శనమిచ్చింది. అదే వూరికి రాచబాట అని చెప్పారు. దాదాపు అర ఫర్లాంగు వుంది ఆ నీళ్ళ బాట.

"అయ్యా! నీళ్ళల్లో పోయేటప్పుడు పాములు కాళ్ళకు చుట్టుకుంటే భయపడకండి!"

మేమంతా ఒక్క క్షణం నివ్వెరపోయాం.

"అబ్బే! అవేం చెయ్యవు. నీళ్ళ పాములే!" అని నవ్వాడు కరణం.

'ఏమో! అవి నీళ్ళ పాములో, త్రాచుపాములో ఎవడికి తెలుసు? ఒక వేళ కరిస్తే ఇంతే సంగతులు. అక్కడి నుంచి హస్పటల్‌కి వెళ్ళాలంటే ఎన్ని రోజులు పడుతుందో?' అనుకున్నాను.

ఎవరి సంచీ వాళ్ళు పట్టుకున్నాం. పాపం పోలీసులు బూట్లు కూడా నెత్తిన పెట్టుకుని బయల్దేరారు.

అదృష్టవశాత్తు ఎవరినీ పాములు పట్టుకోలేదు గాని ప్యాంటులు తడిసి పోయాయి. మోకాళ్ళు దాటి వచ్చాయి నీళ్ళు. చెప్పులు లేకుండా నడిచినందువల్ల

కాళ్ళకి బురద తగిలి వళ్ళు జలదరిస్తోంది.

గట్టు తగిలిన తర్వాత నీళ్ళు తగల్లేదుగాని బురద తగిలింది. నడుస్తున్నంత మేరా బురదే.

కాసేపటికి పోలింగ్ బూత్ చేరాం.

చీకట్లో పడిపోయిన మశీదులా కనిపించింది. లోపలకెళ్ళి చూస్తే బూత్ బంగళా జ్ఞాపకం వచ్చింది. దానికి పైకప్పు లేదు. ఒకటే హాలు షోడుగ్గా వుంది. తుఫాన్‌కి కప్పు ఎగిరి పోయిందట. అందుకే వాసాలు మీద చిరిగిపోయిన టార్పాలిన్ ముక్కలు, గోనె పట్టాలు కప్పారు.

ఆ పనికి పెట్టివాడు- ఇద్దరు కూలీలను పెట్టాడట. వాళ్ళు కూలి కోసం తగాదా పెట్టుకున్నారు.

"రెవిన్యూ ఇనస్పెక్టర్ వచ్చినప్పుడు చెప్పి ఇప్పిస్తాలే!" అన్నాడు మునసబు.

వాళ్ళు గొణుక్కుంటూ వెళ్ళిపోయారు.

"ఇది మా బడి!" అన్నారు వాళ్ళు.

"ఓహో!" అని తల ఎగరేశాను- కాబోలు అని.

మర్నాడు ఎలక్షన్‌కి కావలసిన ఏర్పాట్లు గురించి ఆలోచిస్తూ బల్లమీద కూలబడ్డాను.

* * *

రానే వచ్చింది ఎలక్షన్ రోజు.

ప్రొద్దున్నే దేగిశా నిండా ఉప్మా పంపించాడు కరణం. బిందెతో కాఫీ వచ్చింది.

ఆ వుప్మా తింటే రెండు రోజులు అన్నం తినక్కర్లే దనిపించింది చూస్తే. అంత స్ట్రాంగ్‌గా వుంది. రాత్రి తిన్న అన్నమే ఇంకా కదలలేదు కడుపులోనుంచి.

సరే-రంగంలోకి దిగాం.

బ్యాలెట్ పేపర్లు, వోటర్ల జాబితా, మార్కింగ్ ఇంక్, స్టాంపు ప్యాడూ వగైరా ముందేసుకుని కూర్చున్నారు పోలింగ్ ఆఫీసర్లు. నేను బాక్సు ముందు పెట్టుకుని ఓటర్ల కోసం ఎదురు చూస్తూ కూర్చున్నాను. పోలీసులు వచ్చే వాళ్ళని క్యూలో నిల్చోబెట్టడానికి బూత్ బైట కట్టిన వాసాల ముందు నిల్చున్నారు.

ఎనిమిది దాటింది.

తొమ్మిదైంది ...

ఒక్క ఓటరూ రాలేదు.

మాకు ఆశ్చర్యం వేసింది.

నేను బైట అరుగుమీద నిల్చున్నాను చోద్యం చూస్తూ.

ఎక్కడా నర సంచారం లేదు.

ఏమైపోయారు ఓటర్లందరూ?

లిస్టులో చూస్తే వెయ్యి పైనే ఉన్నారు. ఒక్కళ్ళూ రావడం లేదు!

పది దాటిన తర్వాత గుంపులు గుంపులుగా కొందరు వచ్చారు. కాని వాళ్ళు పోలింగ్ బూత్‌లోకి రాలేదు.

నినాదాలు చేస్తున్నారు.

"రోడ్లు వేయాలి!"

"వూరికి కరెంట్ రావాలి!"

"బడికి మాష్టారు కావాలి!"

"మంచి నీళ్ళకి బావి కావాలి!"

"పశువుల ఆస్పత్రి కావాలి!"

"మనుషుల ఆస్పత్రి కావాలి!"

పోలీసులు దిక్కు తోచక నిల్చుని వున్నారు. వున్నది ఇద్దరు. ఏం చెయ్యగలరు వాళ్ళని? చంపి పాతి పెట్టినా దిక్కులేని మారు మూల గ్రామం అది!

"అందాకా ఓట్లు వెయ్యం!"

"వెయ్యొద్దు ఓట్లు!"

మొత్తానికి వాళ్ళు మా జోలికి రాలేదు. వచ్చే సూచనలు కూడా కనిపించలేదు.

## రచయితలకు మనవి

'విజయ'లో ప్రచురణార్థం పంపే కథలు, నవలలు, కార్టూన్స్, జోక్స్, వ్యాసాలు-ఏవైనా సరే ప్రచురణార్హం కాని వాటిని త్రిప్పి పంపగోరు వారు, తగినంత పోస్టేజీ అంటించిన కవర్లను జత చేయవలసిందిగా కోరుతున్నాం. అప్పుడే నిరాకరించిన వాటిని త్రిప్పి పంపటం జరుగుతుంది. ఆ తర్వాత ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి ప్రయోజనముండదు. 'బాపు అభిమానుల పేజీ'లో పాల్గొనే పాఠకులు, తమ సంభాషణలను కార్డుమీద వ్రాసి పంపితే చాలు.

—ఎడిటర్

రచనలు పంపవలసిన చిరునామా:

ఎడిటర్,

'విజయ'

80-ధనలక్ష్మి కాలనీ,

మద్రాసు-600 026.

ఆ వూరి ఓటర్లు ఎన్నికలు బహిష్కరించారు అనే సంగతి మాకు అర్థమైంది.

కరణం, మునసబు వచ్చారు. వాళ్ళతో మాట్లాడుతూ కూర్చున్నారు. నేను ఏమీ అడగలేదు. ఏం మాట్లాడితే ఏం తంటా వస్తుందో అని వీలైనంత వరకూ నోరు మూసుకుని వూరుకున్నాను.

పది దాటింది.

పదకొండైంది....

జనం పల్చబడ్డారు. అంతా వెళ్ళిపోయారు.

ఒంటరిగా మిగిలిపోయాం.

"ఇక మూటాముల్లె సర్దుకుందాం!" అన్నారు పోలింగ్ ఆఫీసర్లు.

"టైమ్ అయ్యేవరకూ ఇలా కూర్చోవలసిందే! జోనల్ అఫీసర్ వస్తే రావచ్చు!" అన్నాను.

వాళ్ళు నవ్వారు- 'ఇంత దూరం ఎలా వస్తాడు?' అనుకుని.

పన్నెండయింది.

"ఇక భోజనానికి పోతే సరిపోతుంది" అన్నారు పోలీసులు వచ్చి.

"కబురు రానివ్వండి!" అన్నాను.

ఒంటి గంటయింది.

జనం పుట్టలు పగిలినట్లు రాసాగారు. భూమి ఈనినట్టు వస్తున్నారు.

మాకు తారె త్తిపోయింది— పోలింగ్ బూత్‌ను పీకి పారేస్తారో ఏమోనని!

చాలా బుద్ధిమంతుల్లా క్యూలో నిల్చుని పోలింగ్ బూత్‌లోకి రాసాగారు.

లోపల కూర్చున్న మాకు మాత్రం కడుపులో త్రిప్పుతోంది. వాంతులు మొదలౌతాయేమో నని అనుమానం వచ్చింది.

ఓటర్ల నోళ్ళనుంచి వస్తున్న సారాయి వాసన భరించలేనంత ఘోరంగా వుంది.

ముక్కులకి చేతి రుమాళ్ళు కట్టుకోవాలనుకున్నారు పోలింగ్ ఆఫీసర్లు.

'అది చూసి ఓటర్లకి కోపం వస్తే?

'మేం త్రాగి వచ్చామనుకున్నారా? అని తగదా పెట్టుకుని తంతే?'

ఆ మాట నేను అన్నాక, ఆ ప్రయత్నం విరమించుకున్నారు పోలింగ్ ఆఫీసర్లు.

తప్పదు. 'మంత్రసాని తనం ఒప్పుకున్నాక ఏదొచ్చినా....' అనే సామెత గుర్తుకొచ్చింది. *